# ఉపోద్ఘాతం

వడ్డించేవాడు మనవాడైతే మనకి చాలా బాగుంటుంది. కాని వాడికే పాపం ఏమంత బాగుండదు. ఇతర్లకేమాత్రం అనుమానం రాకుండా వాడు తనవాళ్ళకి వడ్డించగలగడం ఒక పెద్ద గండం గడిచి గట్టెక్కడం. ఉపేంద్రుడు దానవాధముల కనుమానం కలుగకుండా తనవాళ్లైన ఇంద్రాదులకు మాత్రమే అమృతం వడ్డించటానికిగాను నడుముకి చీర కట్టుకున్నాడు. దానితో నానా పాట్లు పడి భరత నాట్యం చేశాడు. అయితే దేవతలకి చీమ కుట్టినట్టుగా కూడా లేదు. వడ్డించేవాడు మనవాడు కదా అని ధీమాతో పంక్తులు దీరి కూర్చున్నారు. ఇంతకూ చెప్పొచ్చిందేమిటంటే తినేవాడికేబాధా లేదు. వడ్డించేవాడిదే తలకాయ నొప్పంతాను.

ఎవరైనా వెంకట్రమణకేమిటి! వాళ్ళ మావో బిగ్ షాట్. వాళ్ళ మావ తల్చుకుంటే వెంకట్రమణ కుద్యోగం నిమిషాల్లో పరిగెత్తుకొస్తుంది - అని అనుకున్నా, అన్న వాళ్ళు అమాయకుల జాతికి చెందుతారు. అల్లా అంటే వెంకట్రమణ వాళ్ళ మావ బిగ్‌షాట్ కాదనీ కాదు, వెంకట్రమణ కుద్యోగం రాదనీ కాదు. కాని నిముషాల్లో పరుగెత్తు కొస్తుందని అనుకోవడం, అనడం వాళ్ళని అమాయకులుగా పట్టిస్తాయి. వాళ్ళకి అవినీతి - ఆపుదల శాఖ గురించి, పార్లమెంటులో పారుగింట పచ్చదనం చూస్తే గిట్టని ప్రతిపక్ష సభ్యుల ప్రశ్నల గురించి ఏ మాత్రం తెలియదని, తెలిసిన వాళ్ళకి తెలిసి పోతుంది.

తనవాడి కిచ్చుకునే ప్రతి ఉద్యోగం వెనకాతల మనవాళ్ళు నడిపే పెద్ద కథా కమామీషూ ఉంటాయి. టెస్టు మాచ్ ముందర పిచ్‌ను చదును చేసినంత పకడ్బందీగా నేల చదును చేయటం ఉంటుంది. శ్రీకృష్ణ భగవానుడు తల్చుకుంటే పాండవులకో కొత్త రాజ్యం సృష్టించడమో, రాత్రికి రాత్రి మీ ఆయువు తగ్గించేశాను అంటూ కౌరవుల్ని చంపేయడమో చెయ్యలేక పోయేవాడా? కాని పాండవులకి రాజ్యం ఎందుకు రావాలి అన్న విషయం మీద సర్వకాల సర్వజన సమ్మతంగా వో పెద్ద ఫైలు బిల్డప్ చేశాడు. దాన్ని వ్యాసుడు భారతమనే పుస్తకంలో ఏర్పాటుగా సర్దాడు. కృష్ణ భగవానుడు వాడిన దానికి అందరు 'రాజనీతి' అని పేరుపెట్టి గౌరవించడం నేర్చుకున్నారు.

ఇప్పుడు ఇప్పించటానికి రాజ్యాలు లేవు. ఉద్యోగాలున్నాయి. ఆ ఉద్యోగాల్ని అయిన వాళ్ళ కిప్పించడాన్ని ఉద్యోగనీతందాం. ఉద్యోగనీతిజ్ఞులు మొదటి తరగతి రైలు పెట్టెల్లోను, వాళ్ళ ఇళ్ళల్లోను, నక్షత్రాల హోటల్లోను, తెల్ల గుర్రం మీద నల్ల వీరుడు దౌడు తీసేటప్పుడు తమతమ అనుభవాల్ని కలబోసుకుని పుంజు తోకలు చేసుకుంటారుట. అల్లా అని, వెళ్ళిన వాళ్ళు విని నాతో చెప్పగా నేను విని మీతో మనవి చేసుకుంటున్నాను.

★

# అయ్యా! ఉద్యోగ నీతిజ్ఞుడు గారూ!

అయ్యా! ఉద్యోగ నీతిజ్ఞుడు గారూ! మీరు చాలా గొప్పవారు. అల్లా మీకు సర్టిఫికేటివ్వటానికి నేను తగను. కాని గాంధీ బాబూ! నువ్వు గొప్ప వాడివిస్మీ! అంటూ ఆయన భుజాన్నే తట్టిన దేశంలో పుట్టిన అలవాటు కొద్దీ అంటున్నాను.

మీరు, తెలుగు సినిమాల్లో మాంత్రికుడి మాయాజాలం లాంటి ఎన్ని ఇబ్బందు లెదురైనా కాంతారావులాగా అన్ని కష్టాలకి వోర్చి మీరనుకున్నది సాధిస్తారు. మీరెవరికైనా ఉద్యోగం వేయించ దల్చుకుంటే ఎట్టి క్లిష్ట సమయాల్లోను ధైర్యం కోల్పోరు. భర్తృహరి ఆరంభింపరు అంటూ చెప్పిన పద్యంలో ప్రారబ్ధార్థము నుజ్జగింపని మనుష్యులకి మిమ్మల్ని ఉదాహరణగా తెలుగు మేష్టారు చెప్పవచ్చు.

మీరు చేరదల్చుకున్న లక్ష్యం వైపు మీ ముక్కు తిప్పుకుని ఆపైన ముక్కుకు సూటిగా పోయే సూటిగా పోయే సామర్థ్యం మీకుంది. పైగా మీరు మొహమాటస్థులు. ఎవరికైనా మీవాళ్ళకి ఉద్యోగం వేయిస్తాననే మాటిస్తే మీరు మానెయ్యడానికి, బావుండదని మొహమాట పడ్తారు.

మీరంటే, నాకు అందరిలా కాకుండా, ఎనలేని గౌరవం. మీకొక అభిమాన సంఘం పెట్టడానికి వెనుదీయను. ఈ రచన చంద్రుడి కో నూలుపోగు. అంతేగాని ఇందుకు భుజాలు తడుముకోవాలని ఉద్దేశించి వ్రాసింది కాదు. ఈవిషయం గుర్తించమని నా మనవి.

\- రచయిత

# మనిషికి సరిపడు చొక్కా కథ

కొందరికి షాపుల్లో అమ్మే చొక్కాలు సరిపోవు. అప్పుడు వాళ్ళు తెలిసిన దర్జీవాడి దగ్గరకెళ్ళి కొలతలిచ్చి చొక్కాలు కుట్టించుకుంటారు. ఒకొక్కప్పుడు తెలియనివాడి దగ్గరకు కూడా వెళ్తారు. అప్పుడు ఆ పెద్దమనిషి ఈ మనిషికి సరిపడే చొక్కా తయారు చేస్తాడు. అల్లాగే కొందరు ఘటికులు దరఖాస్తులు కావాలంటూ వచ్చే ఏ ప్రకటనకి సరిపడరు, అల్లాంటప్పుడు వాళ్ళు తమకు తెలిసిన వడ్డించేవాడి దగ్గరకువెళ్ళి తమ కొలతలతో వో ఉద్యోగానికి ఎడ్వర్టయిజు చేయించమని అడుగుతారు. ఆపైన ఆ ఉద్యోగంలో చక్కగా ఇముడుతారు. సరిగ్గా వెంకట్రమణ విషయంలో ఇలాగే జరిగింది.

వో రోజున చౌదరి రాత్రి పుచ్చుకున్న మందుకి పొద్దున్న హేంగోవర్‌తో బాధ పడు తున్నాడు. ఆయన అప్పటికీ చన్నీళ్ళ స్నానం చేసి వెంకటేశ్వర సుప్రభాతం బిగ్గరగా చదివి కాఫీ పుచ్చుకున్నాడు. అయినా తలనొప్పి తగ్గలేదు. ఆయన కల్లాంటి వ్యసనాలున్నాయని చెప్తే ఆయనతో చాటుగా సీసాలు ఖాళీ చేసే స్నేహితులు తప్ప ఎవరూ నమ్మరు. ఆయన ఏం తిన్నా మెళ్ళో ఎముకలు వేసుకుని తిరగడు. అందరికీ కనిపించేవి ఆయన నుదుట బొట్లు, పూజలూను. అందుకని, ఆయన పేరు ఎస్. చౌదరి అయితే 'నిప్పు చౌదరి' గారంటారు. ఆయన తలకాయ ఎల్లాగా నొప్పిగా ఉంది కదా అని, భవాన్స్ జర్నల్ చదువుతున్నారు. అప్పుడు వాళ్ళ పెద్దమ్మా యొచ్చి 'నాన్నా! నీ కోసమో ఆడమనిషొచ్చింది' అంది.

'ఛ! నా కోసం అయ్యుండదు, మీ అమ్మతో చెప్పు' అన్నాడాయన విసుగ్గా.

'కాదు నాన్నా! ఆ అమ్మాయి నీ కోసమే వచ్చింది. నీ ఆఫీసు గదిలో కూర్చోపెట్టా!....నాన్నా మరే ఆ అమ్మాయే తాటి ముంజల వాసనేస్తోంది' అంది.

ఆయనకి '....కాదు కదా!' అనిపించింది. వెంటనే 'పెద్దమనుషులు' సినిమాలో గౌరీనాథ శాస్త్రిలాగా, ఇప్పటి సినిమాల్లో గుమ్మడిలాగా నొసలు ముడేసి 'ఉహ్! లోపలికి పో' అని గంభీరంగా ఆఫీసులోకి నడిచాడు.

అక్కడ కళ్ళ చుట్టు నల్లని చార, వంటిపై నల్లని చీర కల నల్లటి చిన్నది కుర్చీకి నిండుగా కనిపించింది. చౌదరిని చూడగానే లేచి నిలబడి కులికి 'మాయ్య గోరికి మా మీదీ

మద్దె దయ కల్గడం లేదు. అందుకని నేనే వో పలి దర్శనం చేసుకుందావని బయల్దేరి కారెక్కొచ్చాను!' అంటూ సంభాషణకు దిగింది.

ఆ మనిషిని చూస్తుంటే, ఆ మాటలు వింటుంటే ఆయన కివాళ గుండెల్లో రాండోళ్ళు మోగుతున్నాయి. అవే గుండెల్లో అల్లాంటి పరిస్థితుల్లోనే ఆయన తాటిపత్రు కేంపు కెళ్ళిన వాన రోజుల్లో తంత్రులు స్పందించాయి. దాని కాయన ఆ ఊళ్ళో తాగిన తాటికల్లు కారణం అవొచ్చు. ఏది ఎల్లా అయినా ఇక్కడ ఈ రోజు తనకి మతి స్తిమితం తప్పొచ్చు ననిపించింది ఆయనకి. కాని ఆయనకి గాంభీర్యం చాటున భయాల్ని దాచుకోవడం బాగావచ్చు. అల్లా దాచుకుని 'నువ్వొచ్చిన పనేమి?' టని కళ్ళతోనే ప్రశ్నించాడు.

అప్పుడా ఆడశాల్తి, 'తౌమరికి తెల్దా బాబు. మా తమ్ము డెంకట్రవణ విసయం! ఆ డుత్త తాగుబోతెదవైనాడు; ఆ డ్యాపేపారంలో పెడ్దారంటే దుకాణంలో దంతా ఈడే పట్టించేత్తాడని బయమైపోతోంది. అందుకని ఆ తాగుబోతెదవకి గవరమెంటుద్దేగం గాని లాబం లేదనిపించి మీ కాళ్ళ దగ్గరకు పారొచ్చాను బాబూ!' అంటూ కోరింది. అందులో ఇది ఆయన శక్తికి మించిన పని కాదన్న గుర్తింపు వుంది. తాగుబోతు వెధవలకి గవర్నమెంటుద్యోగాలే సరియైనవన్న అభిప్రాయం ఉంది. 'ఉదాహరణకి నీవిషయం తీసుకో' అన్న ఎత్తిపొడుపుంది. చౌదరికి సాటి తాగుబోతు మీద సానుభూతుండక పోతుందా అన్న ధీమా వుంది. పొరపాట్లు చెయ్యగానే సరిపోదు, జరిమానా చెల్లించుకోక తప్పదు! ఇది ఆఫీసులో ఆయన అమలు పరిచే సూత్రమే!

హెడ్‌క్వార్టర్సు నుంచి తాటిపత్రు కేంపు కెళ్ళినప్పుడోసారి ఆయన బట్టలతో పాటు సీసాలు సర్దుకోడం మర్చిపోయాడు. పైగా వాన పట్టుకుంది. అప్పుడాయన చేసేందు కేమీ లేక ఎవరూ గుర్తు పట్టకుండా తలపాగా చుట్టుకుని కల్లు పాక కేసి నడిచాడు. ఈ తలపాగా టెక్నిక్ ఆయన కాకినాడలో చదువుకునే రోజుల్లో నేర్చుకున్నాడు. అప్పు డాయన మొదటిసారిగా వెంకట్రమణకి అక్కైన పార్వతమ్మని చూశాడు. ఊళ్ళో వాళ్ళు అప్పటికే తప్ప తాగి ఇంటికి పోయారు. పార్వతమ్మ దుకాణం కట్టేయబోతుంటే చౌదరి వెళ్ళాడు. వాట్ 69 జానీవాకర్‌కి నిలబడ్డ పెద్దమనిషి దేశీయానికి రెండు రౌండ్సులో బోర్లా పడ్డాడు. 'ఏంటి అలవాటు లేదా?'' అని అడిగింది పార్వతమ్మ. లేదని తలూపాడు చౌదరి. 'బుజ్జి నాయన' అంటూ అక్కున జేర్చుకుంది. వానరాత్రి ఆ వెచ్చదనానికి చౌదరి కరిగి పోయాడు. దాంతోపాటు గాంభీర్యం కరిగిపోయి తానెవరో పార్వతమ్మకి చెప్పాడు. పార్వతమ్మ వెలయాలు కాకపోయినా ఇల్లాంటి పరిస్థితు లామెకి కొత్త కాదు. కాని ఆ రోజు మరుపురాని రోజు ఆమెకి. వచ్చినవాడు పెద్ద ఆఫీసరు. ఆసారి ఆయన తాటిపత్రులో ఉనన్ని రోజులూ వాన పడుతూనే ఉంది.

ఇప్పుడు చౌదరి ముందు నిలబడ్డ ఆమె సాక్షాత్తు పార్వతమ్మ. ఆ మనిషి తలుచుకుంటే ఆయన పరువు బజార్లో పెట్టగలదు. అందులోను, ఆయన నిప్పు లాంటి మనిషి అని అందరూ నమ్మే బజార్లో. కాని ఆమెకా ఆలోచన రాలేదు. ఎందుకంటే ఆమె అంత వరకు పరువు కోసం పాకులాడే మనుషుల్ని చూడలేదు. ఆ పల్లెటూళ్ళో ఎవరే పని చేసినా పబ్లిగ్గా చేస్తారు. కాని చౌదరి భయం చౌదరిది. ఆయన జీవితంలో ప్రమాదానికి అస్కారం ఇవ్వడు.

ఆఖరికి 'ఏం చదువుకున్నాడు?' అని ధైర్యం పుంజుకుని ప్రశ్నించాడు.

'ఆయిదు గట్టెక్కి ఆరు సదువుతూ మానేసాడు. తాగి బళ్ళో నిద్దరోతుంటే ఆళ్ళే రావద్దన్నారు' అని నిజం చెప్పింది.

'మరి మా డిపోలో ఉద్యోగానికి చదువు...' అంటూ మాట పూర్తి చేయబోతున్న చౌదరిని పూర్తి చేయనీయకుండా, 'చదువు లేకపోతే ఏంటండీ? ఆడికి కార్ల గురించి తెలిస్ది లేదు. ఆడికి రాత్రిల్ళు ఇంటి పట్టు నుండే అలవాటు లేదేమో గాని కార్ల గురించి బాగా తెల్సండి. ఆడు రోజూ కార్ల డైవర్ల గురించి కండక్టర్ల గురించి కథలు చెప్పి నవ్వుతుంటాడు', అంది పార్వతమ్మ.

'ఈసా రేదైనా ఖాళీవస్తే చూస్తాలే' అన్నాడు చౌదరి.

తన తమ్ముడి పేరు తాటికల్లెంకట్రవణ అని చెప్పి సెలవు తీసుకుంది.

పార్వతమ్మ సెలవు తీసుకున్న కొద్ది రోజులకి తాటిపర్రు సెక్షన్లో బస్సులు చెకింగ్‌చేసే ఉద్యోగం ఖాళీగా ఉన్నట్టు చౌదరికి వాళ్ళ ఆఫీసు వాళ్ళు తెలియబర్చారు. చౌదరి కింద పనిచేసే శర్మ, ఈ విషయాలు చూసుకుంటాడు. శర్మకి చౌదరికి ప్రాణస్నేహం లేదు కాని పాన స్నేహం ఉంది. శర్మ మరీ చిన్న ఆఫీసరు కాదు. చౌదరి తరువాతి వాడు. అందుకని శర్మతో చౌదరి పాన స్నేహం జేశాడు. అందుకని చౌదరి శర్మని చనువుగా పిల్చి తాటికల్లు వెంకట్రమణ అనే చిన్నవాడు తాటిపర్రు నివాసి అనీ, అతగాడు తన అత్తవారింట్లో నమ్మకంగా పనిచేసే పాలేరు మేనల్లుడనీ, అందుకని తమ తమ వెంకట్రమణ కుద్యోగం వేయిస్తే ఆ సదరు పాలేరు మరింత నమ్మకంగా పని చేస్తాడని, వేయించకపోతే పాలేరు పని చేయడనీ, అప్పుడు తన భార్యకి తన మీద కోపం వస్తుందనీ, అది తన కిష్టంలేదనీ, అందుకని ఆ ఉద్యోగం వెంకట్రమణ కొచ్చేలాగా చూడమని చెప్పాడు.

శర్మ ఈ కథంతా నమ్మినట్టు కనిపించాడు. చౌదరికి తాటిపర్రు కేంపులో దొరికే ఆనందం ఏదో శర్మ ఊహించకపోలేదు. కాని తెలివైనవాడు కనుక చౌదరి చెప్పింది అక్షరాల నమ్మినట్టు కన్పించాడు. చౌదరి ఆ యేడు అతని మీద వ్రాయబోయే కాన్ఫిడెన్షియల్ రిపోర్టు మీద శర్మ భవిష్యత్తు ఆధారపడి వుంది. అందుకని శర్మ చౌదరి కోసం ఏమైనా చేస్తాడు, చౌదరి తాలూకు పిల్లల్ని ఆడించడంతో సహా. అందుచేత 'మీ రంత చెప్పాలా! ఇది నా స్వంత పనిలా చేస్తాను' అంటూ ఊ ఇదై పోయాడు. ఈ పని ఆయనికి నేను చేస్తే రేపు ఈయన నాకు సన్నిహితుడవుతాడు. అవకపోయినా ఆయన తలపాగా తన చేతిలో ఉంటుంది. అని ఆలోచించాడు శర్మ. నోటి మాటను రుజువు చేయడం కష్టమని , ఏదన్నా బెడిసి కొడితే నష్టపోయేవాడు శర్మ అని చౌదరి ఆలోచించాడు. ఆయనకి ఇతర్ల చేతుల్తో నిప్పులోంచి జీడిపిక్క లేరించటం మహా ఇష్టం. శర్మ వెంకట్రమణ గురించి అన్ని వివరాలు సేకరించాడు.

ఓ శుభముహూర్తాన పెద్ద గుమాస్తా రాజు ఎడ్వర్టయిజ్‌మెంటుకి డ్రాఫ్ట్ వ్రాయించి తీసుకొచ్చాడు. దాన్ని చూస్తేనే శర్మ అగ్గిమీద గుగ్గిలం అయ్యాడు. 'ఎవడయ్యా స్క్రిప్టు రాసిన కవి ఇవో డైలాగులా? నే చెప్తా రాసుకో' అంటూ కేకలేసే అగ్రశ్రేణి సినిమా నటుడిలాగా, 'ఎవరయ్యా ఈ డ్రాఫ్టు రాసింది? అడ్డమైనవాళ్ళ చేత రాయించొద్దని నీ కెన్ని సార్లు చెప్పాను?

నీకు బుద్ధుండద్దూ' అని శర్మ కేకలు వేశాడు. రాజు 'ఆయ్' అన్నాడు. శర్మకి రాజులో నచ్చే విషయాల్లో ఇదొకటి. ఎదిరించడు. డ్రాఫ్టులో తప్పు లేం లేవు. ఆ విషయం శర్మకీ తెలుసు. రాజుకీ తెలుసు. మామూలుగా అయితే ప్రకటన అల్లాగే ఉంటుంది. అల్లాగే వుండకపోతే శర్మ కేకలేస్తాడు. అయితే రాజు తెలివైనవాడు. తనకి, ప్రమోషన్‌కి మధ్య పౌరుషానికి చోటీయుడు. శర్మకి రాజులో నచ్చే మరో విషయం ఇది.

'నే చెప్తా రాసుకో' అంటూ శర్మ మొదలుపెట్టాడు. 'తాటిపర్రు సెక్షనులో చెకింగ్ చేయుటకు ఇంతవరకు మా శాఖలో పనిచేయని బాధ్యత తెల్సిన మనిషి కావలెను... ఇంతవరకు మా శాఖలో పని చేయని అని ఎందుకున్నానో తెల్సా? శర్మ రాజు నడిగాడు. 'తెలియదండె' అన్నాడు రాజు, శర్మకి రాజులో నచ్చే విషయం ఇదొకటి, శర్మ చెప్పదల్చుకున్న ఏ విషయాన్ని నాకు ముందరే తెల్సంటూ రాజు కత్తిరించడు.

'మన శాఖలో పనిచేసే వాళ్ళయితే వాళ్ళకి కండక్టర్లు డ్రైవర్లు ఫ్రెండ్సయ్యుంటారు. అల్లాంటి వాళ్ళేం చెకింగ్ చేస్తారు? దొంగలు దొంగలు చేరి ఊళ్ళు పంచుకోడం తప్పించి'.

నిజమేనన్నట్టు రాజు తలూపాడు.

'రాసుకో? ఆ వ్యక్తి తాటిపర్రు నివాసి అయ్యుండవలెను... ఎందుకో తెల్సా? ఆ ఊరివాడే అయితే తను సరిగ్గా డ్యూటీ చెయ్యకపోతే బాధపడేది తన వూరి వాళ్ళే కనుక, వాళ్ళు బాధ పడితే ఇతన్ని జాడించి గాని వదిలిపెట్టరు. కనుక డ్యూటీ సరిగ్గా చేస్తాడు.'

'మరెనండోయ్' అన్న ముద్ర వహించాడు రాజు.

'వయసు ఇరవైకి తక్కువ, ఇరవై ఒకటికి ఎక్కువా కారాదు... ఎక్కువైతే గవర్నమెం టుద్యోగాలకి తీసుకోడానికి వీల్లేదు కదా! తక్కువైతే మెట్యూరిటీ ఉండదు. రాసుకో! మనిషి చూచుటకు గంభీరంగా నుండవలెను... అంటే అతను చూడ్డానికి తాగుబోతు కళ్ళలా ఎర్రటి నిప్పు లాంటి కళ్ళతో భయంకరంగా ఉండాలన్న మాట, అతన్ని చూస్తూనే కండక్టర్లు దారుకోవాలి.'

రాజు చిన్న చిరునవ్వునవ్వి అభినయం పట్టాడు. అది శర్మ వేసిన జోక్‌కిలాగా శర్మకి కనిపించింది. కాని అసలు రాజు, 'తాగుబోతసలు కళ్ళు తెరుస్తేగా అవి నిప్పుల్లా ఎర్రగా కనిపించడానికి' అని మనసులో అనుకున్నాడు. కాని తెలివైన రాజు ఇల్లాంటి విషయాలు బయటకనడు.

'చెప్తా రాసుకో! బస్సు ప్రయాణాల్లో విపరీతమైన అనుభవం కలిగియుండవలెను... అంటే బస్సులో జరిగే అన్ని ట్రిక్కులు తెలిసినవాడై ఉండాలన్న మాట... పొడుగు నూట అరవై అయిదు సెంటి మీటర్లకు తక్కువ, నూటడెబ్బై సెంటీమీటర్ల కెక్కువ కారాదు.. మనిషి గంభీరంగా ఉండాలన్నావా... అందుకని పొడుగు కనీసం నూట అరవై అయిదు సెంటీమీటర్లైనా ఉండాలి. మరీ పొడుగైతే అతను చెకింగ్ చేస్తున్నప్పుడు తల టాపుకి తగుల్తూ ఇబ్బందిగా ఉంటుంది. అప్పుడు మనస్సు పెట్టి పన్జేయలేడు... కనీసం అయిదో తరగతి చదివి యుండవలెను.... ఆ మాత్రం చదువు లేకపోతే ఎల్లా?... పెద్ద చదువు అదర్హతగా పరిగణించబడదు... మన క్కావల్సింది అయిదు. అందుకని బియ్యేలప్పై చేసినా వాళ్ళు

అయిదో క్లాసు పాస్ అయ్యారా లేదా అనే మనం చూడాలి' అని శర్మ జోక్ వేశాడు. రాజు నిర్మొహమాటంగా నవ్వాడు.

ఆ పైన తాటికల్లు వెంకట్రమణ, ఇంటర్వ్యూలో అడగబడిన ప్రశ్నలకి, అంటే తాటిపర్రు రూట్లో ఏ బస్సెక్కడ ఎంతసేపాగుతుంది, కండక్టర్లు డబ్బు చేసుకునే అయిదు విధాలు మొదలుగా గల ప్రశ్నలకి మిగిలినవాళ్ళందరికంటే బాగా జవాబులు చెప్పాడు. అతడి పొడుగు నూట అరవై ఎనిమిది సెంటీ మీటర్లు. అతడి కళ్ళు భయంకరంగా ఎర్రగా తాగుబోతు కళ్ళలా ఉన్నాయి. ఉద్యోగం ఇచ్చారు. ఇచ్చిన వాళ్ళలో చౌదరి లేడు. ఆయన సెలవు పెట్టాడు.... అయితే పై అధికార్లకి శర్మ గురించి, రాజు గురించి మంచి రిపోర్టులు వెళ్ళాయి.

*-ఆంధ్ర సచిత్ర వార పత్రిక - '71*

★